ఉగాది.. మార్కెట్ కిటకిటలాడింది





ఉగాది పండుగను పురస్కరించుకొని సోమవారం షాపూర్‌నగర్‌లోని మార్కెట్ కిటకిటలాడింది. చిరు వ్యాపారులు ఇతర జిల్లాల నుంచి మామిడి, మర్రి, వేప ఆకులు, మామిడికాయ, చింతపండు, వేప పూలు ఇతర పూలను అమ్మకానికి తీసుకొచ్చారు. పచ్చడికి ఉపయోగపడే కుండలను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేశారు. – సుభాష్‌నగర్

అమావాస్య పూజలు


మగ్దూంనగర్‌లో బొడ్రాయికి పూజలు


బస్టాప్ సమీపంలోని దుర్గమాత ఆలయం వద్ద అన్నదానం


ప్రత్యేక అలంకరణలో జగద్గిరిగుట్ట కాళికామాత

అమావాస్యను పురస్కరించుకొని సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లు, స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మగ్దూంనగర్‌లో స్థానికులు బొడ్రాయికి పూజలు చేశారు. జగద్గిరిగుట్ట కొండపై ఉన్న కాళికామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా బస్టాప్ సమీపంలోని దుర్గమాత ఆలయం వద్ద రమేష్ గుప్తా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. – జగద్గిరిగుట్ట

నేడు పంచాగ శ్రవణం

జగద్గిరిగుట్ట: తెలుగు నూతన సంవత్సరమైన ఉగాది పండుగను పురస్కరించుకొని మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఉప్పల అనిల్ కుమార్, అరుణ తెలిపారు. హెచ్‌ఏఎల్ కాలనీ రోడ్ నం.6లోని వపుదైక నిలయంలో సాయంత్రం 5గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పంచాంగ శ్రావణం ఉంటుందన్నారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం, అన్నమాచార్య సంకీర్తన ఆలపిస్తారన్నారు.

ప్రజా సంక్షేమానికి పాటుపడేది బీఆరెస్సే

మల్కాజ్‌గిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి


ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

కుత్బుల్లాపూర్: మన ప్రాంతానికి చెందని వారికి మన సమస్యలు ఎలా తెలుస్తాయని మల్కాజ్‌గిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జీడిమెట్ల డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల సంక్షేమానికి, వారి భవిష్యత్ కోసం అనునిత్యం పాటుపడే పార్టీ బీఆర్‌ఎస్ అని అన్నారు. అయితే ప్రజా సంక్షేమాన్ని పక్కకు పెట్టి కుర్చీ కోసం రాజకీయాలు చేసే పార్టీలు కాంగ్రెస్, బీజేపీలు అని విమర్శించారు. ఇలాంటి పార్టీలను మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి బీఆర్‌ఎస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు.

బీజేపీ, కాంగ్రెస్ నేతలకు సమస్యలు పట్టవు

◆ అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ... వ్యాపారాలు చేసుకునే బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు ప్రజల సమస్యలు పట్టవన్నారు. పార్టీలకు అతీతంగా గత 25 ఏళ్లుగా సామాజిక కార్యక్రమాలు చేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి లాంటి నాయకుడు ఎంపీగా ఉంటే సంక్షేమంతో పాటు అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ది రాములు, సుధాకర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, సమ్మయ్య నేత, గుమ్మడి మధుసూదన్ రాజు, కాలే నగేష్, కాలే గణేష్, జ్ఞానేశ్వర్, విజయ్ హరీశ్, నదిమ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి పెద్దపీట

నిజాంపేట్: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పార్కుల అభివృద్ధి పెద్దపీట వేస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ 7వ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ పార్కును కార్పొరేటర్ బాలాజీ నాయక్‌తో కలిసి డిప్యూటీ మేయర్ సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో జరుగుతున్న లెవలింగ్, వాకింగ్ ట్రాక్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్కులో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు పిల్లల ఆట స్థలాన్ని అందుబాటులోకి తీసుకురానున్నామని పేర్కొన్నారు. పనుల నాణ్యత విషయంలో రాజీపడమన్నారు. అవకతవకలు జరిగితే కఠినంగా వ్యవహరిస్తామని కాంట్రాక్టర్ శ్రవణ్‌ను హెచ్చరించారు.

12వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కృష్ణంరాజు



సాక్షి,సిటీబ్యూరో: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ముదునూరి కృష్ణంరాజును నియమించారు. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి పర్యవేక్షణలో పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌ఎంసీ అధ్యక్షుడు కొలను రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియామక పత్రం అందజేశారు.

నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోండి

నిజాంపేట్: మెరుగైన వసతులు కల్పించే దిశగా పని చేస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ 4వ డివిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వేసవి నేపథ్యంలో నీటి ఎద్దడితో స్థానికులు అల్లాడుతున్నారని తెలిపారు. నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. మేయర్ మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటికి కొరత లేకుండా సమస్య ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని ఇప్పటికే హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించామని తెలిపారు. త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డివిజన్ నాయకుడు సురేంద్రకుమార్ యాదవ్, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

శాంతియుత వాతావరణంలో రంజాన్ జరుపుకోవాలి

సుభాష్‌నగర్: రంజాన్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం సుభాష్‌నగర్‌లోని ఈద్గా మైదానం వద్ద పారిశుద్ధ్య కార్మికులతో చెత్తచెదారాలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈద్గాల వద్ద దాహార్తిని తీర్చేందుకు తాగునీటిని అందుబాటులో ఉంచామన్నారు. ప్రార్థనలకు ఆటంకం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.


సుభాష్‌నగర్ ఈద్గా వద్ద పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సురేష్‌రెడ్డి, ఈద్గా కమిటీ సభ్యులు

ఎండీఎంఏ, గంజాయి స్వాధీనం

నలుగురి రిమాండ్


నిందితులు ఫైజల్, షేక్‌గౌస్

కుత్బుల్లాపూర్: వేర్వేరు ఘటనల్లో ఎండీఎంఏ, గంజాయిని స్వాధీనం చేసుకున్న మేడ్చల్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం మేడ్చల్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మాధవయ్య ఆధ్వర్యంలో సీఐ నర్సిరెడ్డి, ఎస్‌ఐ పవన్‌కుమార్‌రెడ్డి బోయిన్‌పల్లి చెరువు కట్టపై తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా హుండాయ్ కారును సోదా చేయగా 5 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అంబర్‌పేట్ ఆకాష్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఫైజల్, షేక్‌గౌస్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా గోవా నుంచి మత్తు పదార్థాన్ని తీసుకువచ్చి స్థానికంగా ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.

మరో ఘటనలో..

అస్మత్‌పేట్ కూరగాయల మార్కెట్ వద్ద బైక్‌పై వెళుతున్న బోయిన్‌పల్లికి చెందిన లవ్‌ప్రీత్‌సింగ్ (26), సోమరాజ్‌సింగ్(36)లను ఆపి తనిఖీలు చేయగా వారి వద్ద 290 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. వారి నుంచి బైక్, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



వాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో అన్నదానం


జీడిమెట్ల గ్రామంలో అన్నదానం చేస్తున్న వాసవీ సేవాదళ్ సభ్యులు

కుత్బుల్లాపూర్: అమావాస్యను పురస్కరించుకుని సోమవారం జీడిమెట్ల గ్రామంలో వాసవీ సేవాదళ్ ఆద్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. మధ్యాహ్నం 12.30గంటల నుంచి 3గంటల వరకు కొనసాగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని భోజనం చేశారు. ప్రతినెలా అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నామని వాసవీ సేవాదళ్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పడకంటి వెంకటేశం, తోట భిక్షపతి, మాశెట్టి శివకుమార్, ముపిరిశెటి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



కుత్బుల్లాపూర్: కాంగ్రెస్‌తోనే తెలంగాణ రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలోకి చేరిన ఆయనకు కార్యకర్తలు, నాయకుల నుంచి అభినందనలు వెల్లువెత్తున్నాయి. ఆదివారం గాజులరామారంలోని ఆయన కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు రంగారావు, సాగర్‌రావు, ఏ-బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. అదే విధంగా రావినారాయణరెడ్డినగర్ కాలనీ అధ్యక్షుడు సాతాల గోపాల్, అసోసియేషన్ సభ్యులు ఆయన్ని కలిసి సంతోషం వ్యక్తం చేశారు.

అన్నం వండలేదని హత్య చేసిన ఇద్దరి రిమాండ్



నిందితులు సందీప్‌కుమార్(ఏ1), సోను(ఏ2)

జీడిమెట్ల: అయోధ్యనగర్‌లో ఈనెల 4వ తేదీన జరిగిన హత్య కేసులో నిందితులను జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. ఎస్సై నాయుడు వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన హన్స్‌రామ్(38), బిహార్‌కు చెందిన సోను(36), ఉత్తరప్రదేశ్‌కు చెందిన సందీప్(35)లు గ్రానైట్ పనులు చేస్తూ అయోధ్యనగర్‌లో ముగ్గురు కలిసి అద్దెకు ఉంటున్నారు. ఏప్రిల్ 4వ తేదీన సోను, సందీప్‌లు పనులు ముగించుకుని రాత్రి గదికి వచ్చారు. వీరు వచ్చే సరికి హన్స్‌రామ్ మద్యం సేవించి పడుకున్నాడు. అన్నం వండకుండా పడుకుని ఉన్నావని హన్స్‌రామ్‌పై సోను, సందీప్‌లు కోప్పడ్డారు. నన్నే తిడతారా అంటూ హన్స్‌రామ్ సైతం వారిద్దరిపై దుర్భాషలాడారు.

మెడకు టవల్ చుట్టి.. ఊపిరాడకుండా చేసి..

◆ వెంటనే సోను, సందీప్‌లు కలిసి హన్స్‌రామ్ తలను గ్యాస్ స్టౌ ఉంచే గట్టుకు బలంగా గుద్దారు. రక్తం కారుతుండగా మెడకు టవల్ చుట్టి ఇద్దరు కలిసి ఊపిరాడకుండా చేసి హన్స్‌రామ్‌ను హత్యచేశారు. అనంతరం ఇద్దరు కలిసి గది నుంచి రైల్వేస్టేషన్‌కు పారిపోయారు. మరునాడు పక్క గదిలో ఉండే అతను గదిలోకి వెళ్లిచూడగా హన్స్‌రామ్ మృతిచెంది ఉన్నాడు. ఈ విషయాన్ని పోలీసులకు తెలపగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆదివారం సోను, సందీప్‌లను కుత్బుల్లాపూర్‌లో అదుపులోకి తీసుకుని సోమవారం మేడ్చల్ కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

స్విమ్మింగ్‌పూల్‌లో పడి బాలిక మృతి


ఆధ్యా (ఫైల్)

కుత్బుల్లాపూర్: కూతురుతో కలిసి స్విమ్మింగ్ చేసిన తండ్రి బట్టలు మార్చుకునేందుకు వెళ్లాడు. ఇంతలోనే బాలిక స్విమ్మింగ్ పూల్‌లో పడిపోయి చనిపోయిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కుత్బుల్లాపూర్ ఎన్‌సీఎల్ సింధూ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్స్ ప్లాట్ నం .510లో నిఖిల్‌కుమార్ తన కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. ఇతని కుమార్తె ఆధ్యా గోశీ(08) స్థానికంగా ఉన్న కిడ్స్ వరల్డ్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతోంది.

◆ ఈనెల 7వ తేదీన (ఆదివారం) కమ్యూనిటీలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టేందుకు నిఖిల్ తన కూతురు ఆధ్యాతో కలిసి వచ్చాడు. ఈత కొట్టిన అనంతరం నిఖిల్ దుస్తులు మార్చుకునేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి ఆధ్యా కనిపించలేదు. చుట్టు పక్కల వెతికినా కనిపించలేదు. చివరకు స్విమ్మింగ్ పూల్‌లో బాలిక కనిపించడంతో వెలికి తీసి స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉగాది.. సందడి


బచ్‌పన్, నార్త్ సిటీ పాఠశాలల్లో వేడుకలు



కుత్బుల్లాపూర్: ఉగాదిని పురస్కరించుకుని ఒక రోజు ముందుగానే కుత్బుల్లాపూర్ పరిధిలోని పలు పాఠశాలల్లో వేడుకలు జరిగాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాల ఆవరణలో ఉగాది పచ్చడి తయారు చేశారు. ఉగాది ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేసేందుకు ఉత్సవాలు నిర్వహించామని పాఠశాలల యాజమాన్యాలు పేర్కొన్నాయి.

వాకిట రామ్‌రెడ్డికి ఉగాది పురస్కారం

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్‌కు చెందిన అభినవ కవి, మానస టూల్‌టెక్ పరిశ్రమ అధినేత వాకిటి రామ్‌రెడ్డి ఆదివారం భువన భారతి ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం భువనగిరి-యాదాద్రి జిల్లాలోని రాయగిరిలోని సోమా రాధాకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో భువన భారతి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గడ్డం నర్సింహారెడ్డి, జిరసం అధ్యక్షుడు పోరెడ్డి రంగయ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది ఉత్సవ కార్యక్రమంలో సాహిత్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న వాకిటి రామ్‌రెడ్డికి మెమొంటో అందజేసి శాలువతో సత్కరించారు.

పెళ్లికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

రూ.1.06లక్షలు ఎత్తుకెళ్లిన దొంగలు

జగద్గిరిగుట్ట: పెళ్లికి వెళ్లి తిరిగి వచ్చే సరికి ఇంట్లో చోరీ అయిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... భూదేవి హిల్స్ రోడ్ నం.5, సీ బ్లాకులో ఉంటున్న నరేందర్, వెంకటలక్ష్మి దంపతులు 3వ తేదీన నర్సాపూర్‌లో తన బంధువులు ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. ఆదివారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. అందులో ఉన్న ఒక లక్ష 6వేల రూపాయలు దొంగతనం జరిగినట్లు తెలుసుకున్నాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆలస్యంగా వెలుగులోకి..

గత వారంలో ఇదే భూదేవిహిల్స్‌లో ఒక వాహనానికి నిప్పంటించారు. ఈ ఘటనపై ఆరా తీస్తున్న సమయంలోనే ఆదివారం దొంగతనం జరగడం గమనార్హం.

విచ్చలవిడిగా గంజాయి అమ్మకంతోనే..

గంజాయికి అలవాటు పడ్డవారే ఈ పనులు చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా దొంగతనాలకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారు. ఇటీవలే ఇదే కాలనీలో ఓ వ్యక్తి గంజాయి చెట్లను పెంచుతూ పట్టుబడ్డ విషయం తెలిసిందే. ఈ కాలనీకి ఆనుకొని ఖాళీ స్థలంలో రాత్రి సమయాల్లో వీరి హద్దు అదుపు లేకుండా పోయింది. ఇప్పటికైనా ఈ గంజాయి అమ్మకాలను అరికట్టి తగు చర్యలు చేట్టాలని స్థానికులు కోరుతున్నారు.


చెల్లాచెదురుగా బీరువాలోని వస్తువులు


గత వారం ఇదే భూదేవిహిల్స్‌లో తగలబడ్డ వాహనం